www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 24 డిసెంబర్ 2023
5
కాకినాడ

దుర్గాడలో ఉచిత వైద్య శిబిరం

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ప్రజాశక్తి - గొల్లప్రోలు(పిఠాపురం) మండలంలోని దుర్గాడ గ్రామంలో సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గ్రామస్తులకు వైద్య నిపుణులు ఉచితంగా బిపి, షుగర్ పరీక్షలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వాతావరణ మార్పులు, ఆహార అలవాట్లలో మార్పుల కారణంగా వ్యాధులు వస్తున్నాయన్నారు. అందులోనూ బిపి, షుగర్ వంటి వ్యాధుల బారిన ఎక్కువ మంది పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు స్వాతి, దరియా, భావన, ప్రియ, ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉడకని కందిపప్పు

- అస్తవ్యస్తంగా ప్రజా పంపిణీ వ్యవస్థ
- క్రిస్మస్‌కు అరకొరగానే సరఫరా
- సంక్రాంతికైనా పూర్తిస్థాయిలో అందేనా
- బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.170

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

పేదల ఇంట కందిపప్పు కరువైంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ లబ్ధిదారులకు సరఫరా చేయాల్సిన ప్రభుత్వం క్రమంగా సరుకుల తగ్గిస్తూ వస్తుంది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం బియ్యం మాత్రమే పూర్తిస్థాయిలో ఇస్తున్నారు. ప్రతీ నెలా కందిపప్పు అరకొరగానే పంపిణీ చేస్తున్నారు. ఈ నెలలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. గతంలో పండుగల వేళ కొన్ని సరుకులను అందించేవారు. క్రిస్మస్, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా అంటూ అవసరమైన సరుకులను రేషన్ షాపుల ద్వారా ఇచ్చేవారు. ప్రస్తుతం పండుగలను వైసిపి ప్రభుత్వం మర్చిపోయి సరుకుల్లో కోతను యథావిధిగా అమలు చేస్తున్నది. బయట మార్కెట్లో ప్రజలు నిత్యం వాడే కందిపప్పు ధర రూ.160 నుంచి రూ.170 వరకూ ఉంది. రాయితీ పోను కిలో కందిపప్పు రూ.67 కే లభిస్తున్నందున రేషన్ షాపుల ద్వారా పప్పు పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

జిల్లాలో రేషన్ కార్డులు ఇలా..

కాకినాడ జిల్లాలో 6,45,811 బియ్యం కార్డులుండగా 1,060 రేషన్ షాపుల పరిధిలో 420 ఎండియు వాహనాల ద్వారా నెలనెలా బియ్యం, కందిపప్పు, పంచదార పంపిణీ జరుగుతుంది. ఒక్కో లబ్ధిదారునికి కిలో కందిపప్పు ఇస్తుండగా ఈ లెక్కన సుమారు 600 మెట్రిక్ టన్నులు అవసరం ఉంది. ఈ ఏడాది జూన్ నుంచి అరకొరగానే కందిపప్పును సరఫరా చేస్తున్నారు. ఆ నెలలో కేవలం 130 టన్నులే ఇచ్చారు. జులైలో 30 శాతం, అక్కడ నుంచి 40 నుంచి 50 శాతం మంది లబ్ధిదారులకు మాత్రమే కందిపప్పు ఇస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో సగం మందికి ఇస్తున్నా గ్రామీణ ప్రాంతాల్లో 6 నెలలుగా కిలో కందిపప్పు కూడా పంపిణీ చేయలేకపోతున్నారు. బియ్యం, పంచదార మాత్రమే రేషన్ లబ్ధిదారులకు అందుబాటులో ఉంది. కందిపప్పు పంపిణీ లేకపోవడంతో లబ్ధిదారులు బయట మార్కెట్లో కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీనిపై ఎండియు వాహనాల డ్రైవర్లను కొన్ని చోట్ల పలువురు లబ్ధిదారులు నిలదీసే పరిస్థితులు కన్పిస్తున్నాయి.

పండుగల్లోనూ అరకొరే

గతంలో క్రిస్మస్ సందర్భంగా కానుక పేరుతో కొన్ని సరుకులను అందించేవారు. మరో రెండు రోజుల్లో క్రిస్మస్ పండుగ ఉండగా ఈ నెలలో అరకొర కందిపప్పు మాత్రమే ప్రభుత్వం సరఫరా చేసింది. పట్టణ ప్రాంతాల్లో 50 శాతం మందికి ఇవ్వగా పల్లెల్లో పూర్తిగా సరఫరా చేయలేదు. వచ్చే నెలలో తెలుగు వాకిళ్లలో ప్రధాన పండగ సంక్రాంతి. ఈ సందర్భంగా కూడా ఈసారి సగం మంది కార్డుదారులకు మాత్రమే కందిపప్పు అందే పరిస్థితి కనిపిస్తుంది. ఉదాహరణకు యు.కొత్తపల్లి మండల కేంద్రంలో 613 రేషన్ కార్డులున్నాయి. గత 6 నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు. వచ్చే నెలలో 300 మందికి పంపిణీ చేసేందుకు డీలర్లు డిడీలు తీశారు. ఇలా సగం మందికే పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పండుగల్లోనైనా పేదలు రేషన్ దుకాణాల్లో ఇచ్చే సరుకులపైనే ఆధారపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాయితీపై అందించే కందిపప్పు కొన్ని నెలలుగా అరకొరగా పంపిణీ చేస్తున్నందుతో బయట మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయడం పేదలకు భారంగా మారింది. రేషన్ దుకాణాల ద్వారా 100 శాతం కార్డుదారులకు సరకులు సరఫరా చేయాలని వారు కోరుతున్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్షలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి

ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి

-4వ రోజు రిలే నిరహార దీక్షలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి - కాకినాడ

సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యా శాకలో విలీనం చేయాలని పలువురు డిమాండ్ చేశారు. సమగ్రశిక్షా ఉద్యోగులు చేపట్టిన సమ్మె శనివారం నాటికి 4వ రోజుకు చేరింది. ఈ శిబిరాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి, పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.పుల్లయ్య పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖలో పనిచేసే సమగ్రశిక్ష ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలు చేసి, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్నింటిని ఇవ్వాలని, పది లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ పిఎఫ్, ఇఎస్ఐ తక్షణం వర్తింపజేయాలని, మరణించిన ఉద్యోగుల కుటుంబాలలో కారుణ్య నియామకాలు చేపట్టాలని, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచి పార్ట్ టైం విధానాన్ని రద్దుచేసి, మినిమం టైమ్ స్కేల్ అమలు చేసి వేతనాలు పెంచాలని, ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జగన్ ప్రభుత్వం రెగ్యులర్ ఉద్యోగులను, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను, గౌరవ వేతనంపై, ప్రభుత్వ పథకాలలో పనిచేసే వారందరినీ మోసం చేస్తూనే ఉందన్నారు. ఆనాడు అధికారంలోకి రావడానికి ఉద్యోగులందరికీ ఆశపెట్టి, నేడు అధికారంలోకి వచ్చాక నిరాశను మిగిల్చాడని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగున్నరేళ్లపాటు ఎదురుచూపులు చూస్తూనే ఉన్నామని, ఒక్క సమస్యను కూడా పరిష్కరించకుండా ఒంటెద్దు పోకడలకు రాష్ట్ర ప్రభుత్వం వెళ్లడంతో సమ్మె చేయక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. నిత్యావసరాల ధరలు 200 నుంచి 600 శాతం పెరిగితే 2019 నాటి వేతనాలతో ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. తక్షణం సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ శిబిరానికి ఐద్వా నగర కార్యదర్శి జ్యోతి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు సంఘం రాష్ట్ర కోశాధికారి సిహెచ్.రవి, డిఇఒ ఐటి సెల్ విభాగం నుంచి ఎపిఒ వేకటేశ్వరరావు, కాకినాడ అర్బన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ వాణికుమారి, కరప ఎస్‌టియు నాయకులు జిబి.భాస్కర్, రిటైర్ టీచర్ రాజశేఖర్ సంపూర్ణ మద్దతు తెలిపారు. శిబిరానికి జెఎసి అధ్యక్షులు ఎం.చంటిబాబు, పివివి.మహాలక్ష్మి, ఎ.సత్యనాగమణి, పి.రాజు, డి.గంగాధర్, డి.దానియేలు తదితరులు నాయకత్వం వహించారు.

వైద్యపరమైన అంశాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సమాజంలో ఆరోగ్యకరమైన జీవన విధానానికి ఉపాధ్యాయులు వివిధ వైద్యపరమైన అంశాలపై అవగాహన తెచ్చుకోవాలని ఎంఇఒ వై.శివ రామకష్ణయ్య సూచించారు. శనివారం స్థానిక గిరిజన సమీకృత పాఠశాలలో మండలంలోని పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలకు ఫిజియోథెరపీపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో నిజాం ఇన్‌స్టిట్యూట్ ఫిజియోథెరపిస్టులు మహేష్, రమేష్‌లు ఆర్థరైటిస్, స్పాండిలైటిస్, నడుంనొప్పి, మోకాలు నొప్పులు తదితర అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిన్ని చిన్ని వ్యాయామాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.ప్రసాద్, తోటకూర సాయి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంఇఒ

వినియోగదారుల చట్టం కోసం తెలుసుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

విద్యార్థి దశ నుంచే వినియోగదారుల చట్టాలపై అవగాహన పెంచుకోవాలని వినియోగదారుల సంఘం డివిజన్ అధ్యక్షులు భళ్లమూడి సూర్యనారాయణమూర్తి అన్నారు. శనివారం స్థానిక సాగర్ మున్సిపల్ హైస్కూల్లో హెచ్‌ఎం ఎం.ప్రసాద్ అధ్యక్షతన వినియోగదారుల చట్టం - 2019పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసాలకు గురైన వినియోగదారుల రక్షణకు చట్టాలు ఉన్నాయన్నారు. వినియోగదారుల ఫోరం ద్వారా న్యాయం పొందే అవకాశం ఉందన్నారు. తూనికలు కొలతలు శాఖ ఇన్‌స్పెక్టర్ మోహన్ తూనికలు కొలతల్లో జరిగే మోసాలను విద్యార్థులకు వివరించారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సదస్సులో వినియోగదారుల సంఘం కార్యదర్శి ఎం భాస్కర్ రావు, ఎస్.రామలక్ష్మి, ఎం.శివప్రసాద్, కెఎస్ శంకర్, వై వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ మోహన్

పతంజలి శాస్త్రికి అభినందన

ప్రజాశక్తి - పిఠాపురం

సుప్రసిద్ధ తెలుగు రచయిత పతంజలి శాస్త్రికి 'రామేశ్వరం కాకులు' కథా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించడం పట్ల డాక్టర్ ఆవంత్స సోమసుందర్ లిటరరీ ట్రస్ట్ ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ కె వెంకట్రావు ఉపాధ్యక్షులు డాక్టర్ గజరావు సీతారామస్వామి, ట్రెజరర్ మేకా మన్మధరావు, కన్వీనర్ ఆవంత్స శశికాంత్ శాతకర్ణి, కో ఆర్డినేటర్ డాక్టర్ కిలారి గౌరి నాయుడు పతంజలి శాస్త్రికి అభినందనలు తెలిపారు. 2019లో ట్రస్ట్ తరపున శాస్త్రికి సోమ సుందరం కథా పురస్కారం అందజేశామన్నారు. పతంజలి శాస్త్రికి సోమ సుందర్‌తో చక్కటి సాహిత్య అనుబంధం ఉందన్నారు.

గుండెపోటుతో కూరాడ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి - కరప

మండలంలోని కూరాడ గ్రామ సర్పంచ్ గుండుపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం ఉదయం సర్పంచ్ వాసంశెట్టి వెంకటరమణ (63) ఉదయం 6:30 గంటలకు స్నానం చేసేందుకు సిద్ధమవుతుండగా కుర్చీలో కూర్చున్న అతను కదలకుండా ఉండిపోవడంతో కుటుంబ సభ్యులు గమనించి వెంటనే చికిత్స నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యులు పరీక్షించి అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా ఆ సమస్య పరిష్కారానికి కృషి చేసేవారని పలువురు అభిప్రాయపడ్డారు. సర్పంచ్ మృతికి ఎంఎల్‌ఎ కురసాల కన్నబాబు, జడ్‌పిటిసి వై.సుబ్బారావు, ఎంపిపి శ్రీలక్ష్మీ సత్తిబాబు, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీల రిలే నిరహారదీక్షలు

పెదపూడిలో జరుగుతున్న ఆందోళనలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బేబిరాణి

ప్రజాశక్తి - యంత్రాంగం

తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు దిగిన అంగన్‌వాడీల వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేశారు. శనివారం నాటికి వారి ఉద్యమం 12వ రోజుకు చేరింది. జిల్లాలోని పలు మండలాలు, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో రిలే నిరహారదీక్షలు చేపట్టారు. **పెదపూడి** స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద రిలే నిరహార దీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబిరాణి పాల్గొని మాట్లాడారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, రిటైర్మెంట్ వయస్సు పెంచాలని, మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాడ్యుటి అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకురాలు రాజేశ్వరి, యూనియన్ జిల్లా కార్యదర్శి చంద్రావతి, కనకదుర్గ, ఎం.భూదేవి, బి.అరుణ, ఎస్.పద్మ, అర్.సూర్య కల, తదితరులు పాల్గొన్నారు. **కాకినాడ** కలెక్టరేట్ వద్ద జరుగుతున్న నిరసన శిబిరంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలను యూనియన్ జిల్లా కోశాధికారి జి.రమణమ్మ, ఆర్‌టిఐ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు పప్పు దుర్గాప్రసాద్, సుందరపల్లి వివిఎస్ గోపాలకృష్ణ, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు కె.సతీష్, దంద్రుప్రోలు నాగబాబు, న్యాయవాది గణేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు పలివెల వీరబాబు, పెన్షనర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సత్తిరాజు మద్దతు తెలిపారు. నిరహారదీక్ష చేపట్టిన అంగన్‌వాడీలకు సిఐటియు జిల్లా కోశాధికారి మలక వెంకటరమణ నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.నూకరత్నం, ఎస్.మీనాకుమారి, వి.పోసిరత్నం, వై.రామలక్ష్మి, జె.బుజ్జమ్మ, డివిడి భవాని, టి.వీరవేణి, తదితరులు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** స్థానికంగా జరుగుతున్న అంగన్‌వాడీల దీక్షా శిబిరాన్ని యుటిఎఫ్ నాయకులు మెతకాని రాంబాబు, జట్ల సోమరాజు, ఎ.ఆదివిష్ణు, రాజశేఖర్, రవి, సిపిఐ ఎంఎల్ వినోద్ మిశ్రా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోసిరెడ్డి గణేష్, ప్రత్తిపాడులో జరుగుతున్న దీక్షా శిబిరాన్ని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ వరుపుల సత్యప్రభ, టిడిపి నేతలు బద్ధిరామారావు, పర్వత సురేష్, జనసేన, సిఐటియు నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ అధ్యక్షురాలు కాకరపల్లి సునీత, నాయకులు ఎస్. అమలావతి, సిహెచ్.వెంకటలక్ష్మి, జె.రాణి, పి.నూకరత్నం పాల్గొన్నారు. **కాజులూరు** స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న నిరహారదీక్షలో జిల్లా కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వరలక్ష్మి, హనుమావతి, అన్నవరం, పి.రామలక్ష్మి, కంచర్ల నాగమణి, మేడిశెట్టి బైరవకుమారి, పి.సుజాత, కె.కమలాదేవి, తదితరులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** స్థానికంగా జరుగుతున్న అంగన్‌వాడీల నిరసన శిబిరంలో అంగన్‌వాడీలు రిలే నిరహారదీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి మాట్లాడారు. ఈ దీక్షలకు ప్రజాసంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, వళ్ళు రాజుబాబు మద్దతు ఇచ్చారు. దీక్షచేసిన వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు. **కరప** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో చేపట్టిన రిలే నిరహారదీక్షను సిఐటియు మండల కార్యదరి బి.రాంప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.వీరవేణి, ఎస్.వరలక్ష్మి, ఎస్ఎస్.కుమారి, దైవకుమారి, అచ్చారత్నం, కల్పలత, తదితరులు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక మున్సిపల్ సెంటర్లో జరుగుతున్న నిరసన శిబిరంలో అంగన్‌వాడీలు రిలే నిరహారదీక్ష చేపట్టారు. ఈ దీక్షలను యూనియన్ నాయకులు సుబ్బలక్ష్మి, సిఐటియు మండల అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు దాడి బేబీ, ఎస్తేరు రాణి, నాగమణి, అమల, టిఎల్.పద్మావతి, కాలే దేవి, జె కుమారి, తదితరులు పాల్గొన్నారు. **కిర్లంపూడి** స్థానిక తహశీల్దార్ కార్యాలయ సమీపంలో అంగన్‌వాడీల నిరసన శిబిరంలో రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ దీక్షను సిఐటియు మండల అధ్యక్షుడు టి.జీవ, యూనియన్ నాయకురాలు ఈశ్వరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిహెచ్.రత్నం, పి.సావిత్రి, షేక్ పరివిన్, జి.రత్నం, పి. మంగాయమ్మ, పి. ప్రభావతి, హసీనా బేగం తదితరులు పాల్గొన్నారు. **పిఠాపురం** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరసన శిబిరంలో అంగన్‌వాడీలు రిలే నిరహారదీక్ష చేపట్టారు. ఈ శిబిరాన్ని రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు కోనేటి రాజు, సిఐటియు నాయకులు కరణం విశ్వనాథం, వీరబాబు, నాగేశ్వరరావు ప్రారంభించారు. సాయంత్రం ఐదు గంటలకు అంగన్‌వాడీల దీక్షలను కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు కూరాకుల సింహాచలం, ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్.భాస్కరాచార్యులు విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు పద్మ, ప్రాజెక్టు అధ్యక్షురాలు తులసి, నళిని, ప్రజావాణి, విజయశాంత, అమల, బేబీ, తదితరులు పాల్గొన్నారు.

మద్దతు తెలుపుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్ వర్మ

అంగన్‌వాడీల దీక్షను ప్రారంభిస్తున్న యూనియన్ నాయకురాలు సుబ్బలక్ష్మి

కాకినాడలో నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేస్తున్న వెంకటరమణ

కార్టూ'నిజం'



ద్వారంపూడి నుంచి కాకినాడను రక్షించుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ సిటీ ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి నుంచి కాకినాడ నగరాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జనసేన పార్టీ పిఎసి సభ్యులు ముత్తా శశిధర్ నాయకులు చిక్కాల దొరబాబు, దుగ్గన బాబ్జిలు అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. కాకినాడ నగరంలో కొత్తగా వచ్చి వ్యాపారం చేయాలనుకునే వారు బెంబేలెత్తిపోతున్నారని అన్నారు. శుక్రవారం స్థానిక వార్పు రోడ్డులో పెండెం రామకృష్ణకు చెందిన పెట్రోలు బంకుపై ద్వారంపూడి అనుచరులు దౌర్జన్యం చేసి బంకును స్వాధీనం చేసుకున్నారన్నారు. రామకృష్ణ వైసిపిని వీడి జనసేనలోకి వెళ్లడంతో ఆయనపై కక్ష సాధింపులకు ఎంఎల్‌ఎ పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. బాధితుడు, బంకు యాజమాని పెండెం రామకృష్ణ మాట్లాడుతూ తాను ఊర్లో లేని సమయంలో బంకులో పనిచేస్తున్న సిబ్బందిని బెదిరించి రూ.6 లక్షల నగదు, 5 వేల లీటర్ల పెట్రోలు, 6 వేల లీటర్ల డీజిల్ను అపహరించారని చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళితే ఎంఎల్‌ఎ ద్వారంపూడికి భయపడి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు కూడా తీసుకోలేదని, తర్వాత ఎస్‌పి కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఎంఎల్‌ఎ ద్వారంపూడి కాకినాడ సిటీలో వ్యాపారాలు చేస్తున్న కాపులపై కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు తలాటం సత్య, అడబాల సత్యనారాయణ, డేగల సతీష్, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ముత్తా శశిధర్

ప్రయివేటు ఆసుపత్రుల సేవలు అభినందనీయం

రోగులకు మందులు పంపిణీ చేస్తున్న జ్యోతుల నెహ్రూ

ప్రజాశక్తి - గండేపల్లి

గ్రామాల్లోని ప్రజలకు ప్రయివేటు ఆసుపత్రి యాజమాన్యాలు స్వచ్ఛందంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని మాజీ ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని సూరంపాలెం గ్రామంలో గ్రామ ఉపసర్పంచ్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి సూరంపాలెం బాలు, నయన శ్రీల ఆధ్వర్యంలో సూరంపాలెం ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. నిర్వాహకులు బాలు మాట్లాడుతూ జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ ఆశీస్సులతో రాజానగరం జిఎస్ఎల్ జనరల్ హాస్పటల్, కాకినాడ విజన్ ఐ కేర్ హాస్పిటల్స్ సంయుక్తంగా ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా బిపి, షుగర్, ఇసిజి, స్కానింగ్, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్.అప్పలరాజు, పి.మోహనరావు, కె.రామకృష్ణ, పి.బాబురావు పాల్గొన్నారు.

క్రీడాకారుల ప్రతిభను ప్రోత్సహిద్దాం

ర్యాలీకి జెండా ఊపుతున్న జెసి, ఎంఎల్‌ఎ, నగర కమిషనర్

ప్రజాశక్తి - కాకినాడ

క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీయాలనే సంకల్పంతో ప్రభుత్వం నిర్వహిస్తోన్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను పటిష్టవంతమైన ప్రణాళికతో నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఇలాక్కియ అధికారులకు పిలుపునిచ్చారు. స్థానిక రాజా ట్యాంక్ పార్కు నుంచి ఆనందభారతి గ్రౌండ్స్ వరకు శనివారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై ఏర్పాటు చేసిన భారీ ర్యాలీని జెసి ఇలాక్కియా, అర్బన్ ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, నగరపాలకసంస్థ కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు, కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుంచి క్రీడా పోటీలు ప్రారంభమవుతాయన్నారు. గ్రామీణ స్థాయి నుంచి పట్టణాల్లో సచివాలయ పరిధి నుంచి పోటీలు నిర్వహించి వీటిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారన్నారు. ద్వారంపూడి చంద్రశేఖ రెడ్డి మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా పేరిట సిఎం జగన్ ప్రతిభ కల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎఎంసి ఛైర్మన్ పి.వెంకటలక్ష్మి, జిల్లా ఐటీ సెల్ ఛైర్మన్‌బి.కృష్ణప్రియ, మున్సిపల్ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిసి కోన శ్రీనివాస్, మేనేజర్ కె.సత్యనారాయణ, టిపిఆర్ఒ ఎం.కృష్ణమోహన్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్, అన్నవరం ట్రస్ట్‌బోర్డు సభ్యులు కె.భామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-ముమ్మిడివరం

కుటుంబ కలహాలతో నేపథ్యంలో వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని అయినాపురం గ్రామంలో జరిగింది. దీనికి సంబంధించి ట్రైనీ డిఎస్‌పి విష్ణు స్వరూప తెలిపిన వివరాల ఇవి.. ప్రకారం గంధం రత్నం(30)కి వీర వెంకట సత్యనారాయణతో 11 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి పాప, బాబు ఉన్నారు. భర్త నిత్యం వేధింపులకు గురి చేస్తుండటం తో శనివారం ఉదయం రత్నం ఇంట్లో ఉరేసుకుని మతి చెంది ఉండటాన్ని గుర్తించారు. దీనిపై మతురాలి తమ్ముడు ఫిర్యాదు మేరకు ట్రైనీ డీఎస్పీ పర్యవేక్షణలో ఎస్‌ఐ శివ ప్రసాద్ కేసు నమోదు చేశారు. మత దేహాన్ని శవ పంచనామా నిమిత్తం ముమ్మిడివరం సామాజిక ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాము కాటుతో కౌలు రైతు మృతి

ప్రజాశక్తి-కాట్రేనికోన

రైతు దినోత్సవం రోజున పాము కాటుతో కౌలు రైతు మృతి చెందటంతో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాట్రేనికోన మండల పరిధిలోని చెయ్యేరులో కౌలు రైతు మట్టపర్తి సత్యనారాయణ పాముకాటుతో మృతి చెందారు. ముమ్మిడివరం మండల పరిధిలోని మల్లాయిపాలెంకు చెందిన కౌలురైతు సత్యనారాయణ వరి నారుమడి వేస్తుండగా పాము కాటువేసింది. అతనిని చికిత్స నిమిత్తం అమలాపురం ప్రభుత్వ ఆస్పత్రికి.అక్కడినుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అతనిని పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మతునికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యతి రెస్టారెంట్ పై ఆకస్మిక దాడి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

స్థానిక రైల్వేస్టేషన్ ఎదురుగా గల యతి రెస్టారెంట్‌పై శనివారం విజిలెన్స్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు, లీగల్ మెట్రాలజి అధికారులు, రెవెన్యూ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించిచారు. ఈ తనిఖీల్లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలకు సంబంధించి ఒక కేసు, అనుమతి లేని వెయిట్ (కాటా) మిషన్ ఉపయోగించడంపై ఒక కేసు, యతి రెస్టారెంట్‌కి బదులు సిరి ఫుడ్స్ పేరుతో సర్టిఫికేట్ కలిగి ఉన్నందుకు ఒక కేసు మొత్తం మూడు కేసులు నమోదు చేశారు. రెస్టారెంట్ నుంచి చికెన్ ధమ్ బిర్యానీ మరియు మిర్చి పౌడర్ యొక్క నమూనాలను విశ్లేషణ కోసం నాచారంలోని ఫుడ్ లాబొరేటరీకి పంపారు.

లారీ దూసుకెళ్లి ఇద్దరు మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని జెడ్.రాగంపేట జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చిన్న కాలంలోకి దూసుకెళ్లిన ప్రమాదంలో లారీ క్యాబిన్లో ఇరుక్కుపోయి ఇద్దరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం పెంటపాడు గ్రామం చెందిన లచ్చిరెడ్డి రాంబాబు (51) రేపల్లి గంగాధర్ (37) చేపల లోడుతో విశాఖపట్నం వెళతుండగా జగ్గంపేట శివారు వచ్చేసరికి లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కాలువలోకి దూసుకుపోయింది. దీంతో వెనకనున్న చేపల లోడు క్యాబెన్‌లో దూసుకొచ్చింది. దీంతో వారిద్దరూ క్యాబెన్‌లో ఇరుక్కుని మృతి చెందారు. మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చోరీ సొత్తు స్వాధీనం

నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి - కడియం

మండలంలోని మురమండలో జరిగిన ట్రాక్టర్ చోరీ కేసులో నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి కొంతమేర చోరీ సొత్తును స్వాధీనపరచుకున్నట్లు కడియం ఎస్ఐ మహమ్మద్ హస్సక్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఎస్ఐ వివరాలను వెల్లడించారు. గత నెల 4న మురమండ గ్రామంలో గన్ని రామారావు తన కౌలు పొలం వద్ద ఉంచిన ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించిపోయారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీనిపై నిఘా పెట్టగా ఈనెల 22న మురమండలో అనుమానస్పదంగా సంచరిస్తున్న పోతంశెట్టి విజయరెడ్డి, పోతంశెట్టి సూర్య భాస్కర్ రెడ్డి, పోతంశెట్టి సాయిరామరెడ్డి, పోసి శేఖర్ లను అదుపులోకి తీసుకుని విచారణ చేయగా ట్రాక్టర్ను తామే దొంగిలించినట్లు నేరం ఒప్పుకున్నారని తెలిపారు. ఈ నేరంతోపాటు ఆగస్టు 31న కుతుకులూరు గ్రామానికి చెందిన మరొక ట్రాక్టర్ను, పెనుమత్ర మండలం జుట్టుగ గ్రామంలో ట్రక్కుతో ఉన్న మరో ట్రాక్టర్ను దొంగిలించినట్లు ముద్దాయి ఒప్పుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే గత నెలలో లొల్ల, కేశవరం, చిన ద్వారపూడి గ్రామాల్లో గల పొలాల కల్లాల వద్ద ఉంచిన 50 ధాన్యం బస్తాలను దొంగిలించి వాటిని ఓ రైస్ మిల్లులో అమ్మినట్లు, అలాగే అదే నెలలో అనపర్తి మండలం అత్తమూరులో రోడ్డు ప్రక్కన ఉంచిన మూడు ట్రాక్టర్ ఐరన్ వీల్స్ ను దొంగిలించినట్లు ముద్దాయిలు తెలిపారని, దొంగలించిన వీటిలో రెండు ట్రాక్టర్ ట్రక్కులను 40 వేలు, 46 వేలకు పాత ఇనుప సామాను వ్యాపారికి విక్రయించినట్లు ముద్దాయిలు తెలిపారని, వాటిలో రెండు ట్రాక్టర్లను, ఐరన్ వీల్స్ ను, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనపరచుకుని నలుగురు ముద్దాయిలపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసును చాకచక్యంగా దర్యాప్తు చేసిన సిఐ తిలక్, ఎస్ఐ మహమ్మద్ హస్సక్, కడియం పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఎస్ఇబి ధికారుల దాడులు

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలో పలుచోట్ల ఎస్ఇబి అధికారులు దాడులు నిర్వహించారు. ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఇబి సిఐ డి.సుధా తెలిపారు. శనివారం ఎస్ఇబి సిఐ తెలిపిన వివరాలు.. ప్రకారం మండలంలోని గోపవరం గ్రామంలో దాడులు నిర్వహించగా బొర్ర గోపాలకృష్ణ 12 మద్యం సీసాలు కలిగి ఉండడం చేత అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా రాజంపాలెం గ్రామంలో దాడులు నిర్వహించగా వనమా బంగారు రాజు అను వ్యక్తి 6 లీటర్ల నాటుసార కలిగి ఉండడం చేత అరెస్టు చేసి ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు అమె తెలిపారు.

కుడి ఎడమైతే..కలిసిసొచ్చేనా...

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

'కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్ ఓడిపోలేదోయ్' అనే ఓ సినీ కవి' అయితే ఆది వర్తమాన రాజకీయాలలో ఏ మాత్రం ఫలితాలను ఇస్తుందో వేచిచూడాల్సి వస్తుంది. కేవలం కొద్ది నెలల వ్యవధిలో సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి అధినేతలు వ్యూహ, ప్రతి వ్యూహాలను మరింత ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలోనే అధికార పార్టీలో అధినేత ఇప్పటికే సీట్ల పంపకం జీపై ఓ క్లారిటీ ఇచ్చేశారు. ఉమ్మడి జిల్లాలోని 19 అసెంబ్లీ స్థానాల్లో 8 నియోజక వర్గాల్లో సిట్టింగ్‌లకు స్థానచలనం తప్పదని తెలుస్తోంది. ఈ జాబితాలో మంత్రులు సైతం ఉండటం గమనార్హం. అయితే పి. గన్నవరం ఎంఎల్‌ఏ ఇప్పటికే తన అనుచరుల ద్వారా నిరసన గళం విన్పిస్తున్నారు. మిగిలిన వారి పరిస్థితి నివురు గప్పిన నిప్పులా మారింది. ఆశా వహులు ఆశల పై సైతం నీళ్ళు చల్లటంతో రాజ కీయం మరింత వేడెక్కింది. అయితే సొంత నియోజక వర్గంలో పనిచేయని ఎంఎల్‌ఏలు మరో నియోజక వర్గంలో ఏ మేరకు ఓటర్లను ఓటర్లను ప్రసన్నం చేసు కుంటారో వేచిచూడాల్సి ఉంది. మరో వైపు తెదేపాలోనూ దాదాపుగా అన్ని నియోజక వర్గాల్లోనూ పోటీ నెలకొంది. అభ్యర్థుల ఎంపిక కూడా ఇప్పటికీ పూర్తి స్థాయిలో స్పష్టత రాలేదు. అయితే అధికార పార్టీలో గ్రూపులు, అధినేత నిర్ణయాలు తమకు సానుకూలంగా మారతాయనే ఆశాభావం వ్యక్తమవుతోంది. కుడి ఎడమైతే ఏమి జరుగుతుందో వేచి చూడాలి మరి.

అధికార పార్టీకి నిరసన సెగ

అధికార పార్టీకి నిరసన సెగ ఉధృతంగా మారింది. అంగన్‌వాడీలు, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు సమ్మె బాట పట్టిన విషయం విదితమే. సుమారు 11 రోజులుగా వివిధ రూపాలలో నిరసిస్తున్న ఆందోళనకు విశేష మద్దతు లభిస్తోంది. మరోవైపు ఆశా 36 గంటల దీక్షలు, ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగుల నిరసనలు, మెడికల్ రిప్రజెంటేటివ్స్,మిడ్ డే మీల్స్ కార్మికులు ఆందోళనలు సైతం మిన్నంటాయి. జనవరి 5న చేపట్టబోయే ఛలో విజయవాడ కార్యక్రమానికి మిడ్ డే మీల్స్ కార్మికులు సన్నద్ధం అవుతున్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం

గోదారి గలగలలు

తీసుకొచ్చిన భూహక్కు చట్టం 27/2023కు వ్యతిరేకంగా న్యాయవాదులు ఆందోళన బాట పట్టారు. ఈ చట్టం ఫలితంగా రాబోయే రోజుల్లో ఎదురయ్యే ఇబ్బందులను ప్రజలకు వివరిస్తున్నారు. వరుస పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం చర్చలు జరిపి ఎక్కడ కక్ష్య పరిష్కరించాల్సిన బాధ్యతను విస్మరించి పూర్తి భిన్నంగా వ్యవహరించడం నిరంకుశ వైఖరిని దర్పణం పడుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను బద్దలు కొట్టి ఇప్పటికే స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. కేంద్రాల నిర్వహణ చేయలేక సచివాలయ సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు విజిట్ల పేరుతో మరింత ఒత్తిడి చేస్తున్నారు.పాలకుల బెదిరింపులకు ఏ మాత్రం తలొగ్గ కుండా అంగన్‌వాడీలు సమ్మెను కొనసాగిస్తున్నారు. అదే స్ఫూర్తితో సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు ఉద్యోగులు జిల్లా విద్యాధికారి కార్యాలయాల ఎదుట ఆందోళనలు కొనసాగిస్తున్నారు.

యాత్రకు దక్కని ప్రజాదరణ

వైసిపి చేపట్టిన సామాజిక సాధికారత బస్సు యాత్రకు ఆశించిన స్థాయి లో ప్రజాదరణ దక్కలేదు. గడిచిన వారం లో మండపేట, దేవరపల్లిలో నిర్వహించిన సభలు వెలవెలబోవటం పరిస్థితి దర్పణం పడుతుంది. గడిచిన నాలుగేళ్లలో ప్రజా సమస్యను పెడచెవిన పెట్టిన వైసిపి ప్రభుత్వ సంక్షేమం పేరుతో ప్రజలను మభ్యపెట్టేందుకు చేసిన ప్రయత్నాలు ఆశించిన స్థాయిలో ఫలితాలు రాబట్టలేదని ఆ పార్టీ నేతలకు సైతం స్పష్టం అవుతోంది. గతంలో ఇంటింటికి పేరుతో చేపట్టిన యాత్రలోనే గమనించి సప్తికే తాజా యాత్రతో పూర్తి స్పష్టత వచ్చినట్లు తెలుస్తోంది. కేవలం ఒకరు ఇద్దరికి పదవులు కట్టబెట్టి సాధికారత పేరుతో ప్రచారం చేసే ప్రజలు కూడా నమ్మే పరిస్థితి లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించుకుని ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కార దిశగా చిత్తశుద్ధితో వ్యవహరించాలి. లేని పక్షంలో రాబోయే ఎన్నికల్లో పరిస్థితి తలకిందులవటం తప్పదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

అద్వితీయ గ్రంథం 'కాకినాడ చరిత్ర'

బుక్‌ను ఆవిష్కరిస్తున్న ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ శేషారెడ్డి

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

స్థానిక ఆదిత్య మహిళా కళాశాల ప్రాంగణంలో చారిత్రక పరిశోధకులు ర్యాలి ప్రసాద్ రచించిన పరిశోధక గ్రంథం 'కాకినాడ చరిత్ర' పుస్తకావిష్కరణ సభ శనివారం జరిగింది. ఆదిత్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ కాకినాడ పట్టణం పౌరాణిక కాలం నుంచి నేటి వరకూ గల చరిత్రను ఈ పుస్తకంలో అద్భుతంగా రచయిత వివరించారని, మరో వందేళ్ల వరకూ కాకినాడ గురించి తెలుసుకోవాలనుకునే వారికి ఉపయోగపడే పుస్తకమన్నారు. ముఖ్యాతిథిగా విచ్చేసిన నల్లమిల్లి బుచ్చిరెడ్డి మాట్లాడుతూ శతాబ్దాల కాకినాడ వివిధ దశల్లో పాఠకుల కళ్లముందు నిలిపిన రచయిత శ్రమ పుస్తకంలో కనిపిస్తుందన్నారు. ఆర్.రత్నాజయ్ పుస్తకాన్ని సమీక్షిస్తూ అతి చిన్న మత్స్యకార గ్రామంగా ఉన్న కాకినాడ అంచెలంచెలుగా నగరంగా రూపుదిద్దుకోవడం వెనుక గల ప్రయాణాన్ని రచయిత ప్రసాద్ అద్భుతంగా తీర్చిదిద్దారని, కాకినాడ నగరవాసులు ఈ పుస్తకం చదివిన సరికొత్త అనుభూతితో కాకినాడను చూసే విధంగా రచించారని, పౌరాణికం, చరిత్ర, ఆలయాలు,సాహిత్యం, సంగీతం, నాటకం, సినిమా వంటి అనేక విభాగాల సమాచారాన్ని అవసరమైనంత వరకూ అందించారన్నారు. ప్రముఖ రచయిత్రి పుప్పాల సూర్యకుమారి మాట్లాడుతూ కాకినాడ స్మార్ట్ సిటీగా ఎదిగిన నేటి కాలానికి పూర్వ చరిత్ర తెలుసుకోవడం అత్యవసరమని, చరిత్రను అన్ని కోణాల్లో పరిశోధించి రచయిత రచించారని అన్నారు. రచయిత ర్యాలి ప్రసాద్ మాట్లాడుతూ విదేశీయుల పదఘట్టనలతోనూ, స్వాతంత్రపోరాటంలో కీలకమైన అనేక ఘట్టాలకు, వందేమాతరం ఉద్యమం, అఖిల భారత కాంగ్రెస్ సమావేశాలకు వేదికగా నిలిచిందని, ఆదరించిన వారందరికీ కతజ్ఞతలు తెలిపారు. కాకినాడ చరిత్ర గ్రంథాన్ని నల్లమిల్లి శేషారెడ్డి దంపతులకు అంకితమిచ్చారు. ఈ సందర్భంగా రచయిత ర్యాలి ప్రసాద్ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నల్లమిల్లి బుచ్చిరెడ్డి, పోలిశెట్టి మల్లిబాబు, గొడవర్తి సత్యమూర్తి, మార్ని జానకిరామ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన గళ్ల కృష్ణ మాదవ్

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సూరంపాలెం మాజీ ఉపసర్పంచ్ వైసిపి నాయకుడు గళ్ళ కృష్ణ మాధవ్ కుటుంబం, ఆయన అను చరులతో కలిసి వైసిపిని వీడి జ్యోతుల నెహ్రూ సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సంద ర్భంగా వారికి టిడిపి రాష్ట్ర ఉపా ధ్యక్షులు జ్యోతుల నెహ్రూ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్ అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు పరికరాల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

అవుట్ సైడ్ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో మంజూరైన చేనేత పరికరాలను ఇంజరం చేనేత సహకార సంఘంలోని 46 మంది లబ్ధిదారులకు చేనేత మరియు జౌలు శాఖ సహాయ అభివృద్ధి అధికారి దంగేటి రాంబాబు, ఇంజరం పంచాయతీ సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్ లు అందజేశారు. ఈ సందర్భంగా 46 సోలార్ లైటింగ్ యూనిట్స్ అంద చేశారు.

దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని శ్రీపాదవల్లభ మహాసం స్థానంలో జరుగుతున్న దత్త జయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా శనివారం విశేష పూజలు జరిగాయి. స్వాములకు లక్షతులసి అర్చన, శతరుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం పల్లకిసేవ జరిగింది. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ రెడ్డెం జనార్ధనరావు, కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

పాదగయలో సహస్ర గులాబి అర్చన...

పట్టణంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభూగా వెలసిన దత్తాత్రేయస్వామికి శనివారం సహస్ర గులాబి అర్చన నిర్వహించారు. పాదగయలో జరుగుతున్న దత్తాత్రేయ జయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా నాలుగవరోజు పంచామృతాభిషేక సహిత శతరుద్రాభిషేకం, సహస్ర నామార్చన దత్తమాలమంత్రం, గురుచరిత్ర పారాయణలు, సామూహిక విష్ణు, లలితా సహస్రనామాల పారాయణ జరిగాయి. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఛైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి సిఎం కృషి

వృద్ధిరాలితో మాట్లాడుతున్న దవులూరి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

రాష్ట్రంలో పేద, బడుగు వర్గాల ప్రజల అభ్యున్నతికి సిఎం జగన్ కృషి చేస్తున్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శనివారం సామర్లకోట సచివాలయం -1 పరిధిలో గడపగడపకూ వైసిపి కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో ఎంఎల్ఏగా పోటీ చేస్తున్నానని, ప్రజలందరూ వైసిపికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పాలిక కుసుమ చంటిబాబు, పాగా సురేష్ కుమార్, జట్లా మోహన్, నేతల హరిబాబు, సాయి, గోపి పాల్గొన్నారు.

పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలి

స్టడీ మెటీరియల్‌ను అందుకున్న విద్యార్థులతో యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

పదో తరగతి విద్యార్థులు పాఠ్య పుస్తకాలతోపాటు స్టడీ మెటీరియల్‌ను ఉపయోగించుకుని మెరుగైన ఫలితాలు సాధించాలని కాకినాడ జిల్లా యూటిఎఫ్ గౌరవ అధ్యక్షుడు ఎంవి.సాయిరాం, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పివివి.సత్యనారాయణ సూచించారు. యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో దాతలు సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను పదోతరగతి విద్యార్థులకు శనివారం అందజేశారు. మండలంలోని మామిడాడ, కాండ్రేగుల, గొల్లలగుంట జడ్‌పి ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా సాయిరామ్ మాట్లాడుతూ ఎంఎకె దర్ట్ ద్వారా బడుగు బలహీన విద్యార్థులకు మెరుగైన ఫలితాలు రావాలనే ఉద్దేశ్యంతో దాతలు సమకూర్చిన స్టడీమెటీరియల్స్‌ను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షుడు గొర్రె వెంకటేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడు జివి.సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ కేంద్ర పథకాల అమలు

ప్రజాశక్తి - పెద్దాపురం

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు అర్హులందరికీ అమలు చేయడమే వికసిత్ భారత్ ప్రచార యాత్ర లక్ష్యమని ఇవిపిఆర్‌డి కె.రాజశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని జి.రాగంపేట పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బుంగా శేఖర్ అధ్యక్షతన వికసిత్ భారత్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామీణ ప్రజలకు అవగాహన లేక లబ్ధి పొందలేకపోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ఉపయోగాలు, అర్హుల గుర్తింపు వంటి అంశాలపై గ్రామాల్లో ప్రజలందరికీ అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విత్తనాల వెంకటరమణ, పెద్దిరెడ్డి రవికిరణ్, తుమ్మల పద్మజా లక్ష్మి, కరెడ్లదేవి, చెరుకూరి రవికృష్ణ, చెరుకూరి రమేష్, ఎంపిటిసి సభ్యులు కె.అనురాధ, పంచాయితీ కార్యదర్శి రమేష్ బాబు పాల్గొన్నారు.

బైకుతో భావిని ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి - కాజులూరు

కాజులూరు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు కాకినాడ నుంచి స్వస్థలానికి వస్తూ ద్విచక్రవాహనం నుంచి ప్రమాదవశాత్తు బావిలో పడ్డారు. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరిని స్థానికులు ప్రాణాలతో కాపాడారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలను ఎస్ఐ తులసిరామ్ వెల్లడించారు. కాజులూరు గ్రామానికి చెందిన కాకి వెంకటేశ్వరరావు(37) ఇతని స్నేహితుడు జక్కిలంక శ్రీను ఇద్దరు కాకినాడ నుంచి ద్విచక్రవాహనంపై కాజులూరు వస్తుండగా శనివారం తెల్లవారు జాము 4 గంటల ప్రాంతంలో గొల్లపాలెం శివాలయం సమీపంలో గల బావిని మోటార్ సైకిల్‌ను బలంగా ఢీకొట్టి ఇద్దరు ఎగిరిపడి బావిలో పడ్డారు. ఈ ప్రమాదంలో కాకి వెంకటేశ్వరరావు ఊపిరాడక మృతి చెందగా, మరొక వ్యక్తి జక్కిలంక శ్రీనును స్థానికులు రక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వఆసుపత్రికి తరలించామని కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రఘుదేవపురం గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి గాయలపాలయ్యాడు. ఆ ప్రమాదానికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన మనెల్లి వెంకటరత్నం రాజమహేంద్రవరం నుంచి ద్విచక్ర వాహనంపై పురుషోత్తపట్నం వెళ్తుండగా రఘుదేవపురంలో పెందుర్తి నాగరత్నం ఇంటి నుంచి ఒక వ్యక్తి సైకిల్‌పై రావడంతో ఇద్దరూ ఢీకొట్టుకున్నారు. ఈ ప్రమాదంలో వెంకటరత్నం తలకు తీవ్ర గాయాలు కావడంతో రఘుదేవపురంలో రమానర్సింగ్ హోమ్‌లో ప్రథమ చికిత్స అనంతరం కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. సైక్లిస్ట్‌కి చిన్న చిన్న గాయాలు కావడంతో రమానర్సింగ్ హోంలో చికిత్స పొందుతున్నాడు.

ముక్కోటి ఆదాయం రూ.44.66 లక్షలు

ప్రజాశక్తి - అన్నవరం

ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని అన్నవరం సత్యదేవునికి ఒక్కరోజు రూ.45 లక్షలు ఆదాయం వచ్చింది. ముక్కోటి శనివారం రావడంతో వేల సంఖ్యలో భక్తులు కొండపైకి విచ్చేశారు. అందుకు తగ్గట్టుగా దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వారా దర్శనం గుండా భక్తులు దర్శించుకునేలా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. దీనితో ఉత్తర ద్వార గడియలు మధ్యాహ్నం 12 గంటల వరకు 50,000 మంది భక్తులు దర్శించుకున్నారు. క్యూలైన్ వద్ద సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యంతో భక్తులు చాలా ఇబ్బంది పడటంతో ఇఓ స్పందించి తక్షణ చర్యలు తీసుకున్నారు. రద్దీకి తగ్గట్టుగా 4500 వ్రతాలు, 80 కళ్యాణాలు, జరుగగా వివిధ సేవా టికెట్లు, ప్రసాదాలు ఇంకా ఇతర విభాగాల ద్వారా రూ.45 లక్షలు ఆదాయం లభించినట్లు దేవస్థానం అకౌంట్స్ విభాగం అధికారి అనకాపల్లి ప్రసాద్ 'ప్రజాశక్తి'కి తెలిపారు.

ఫుట్ బాల్ టీమ్‌కు ఆదిత్య విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఇఇఇ విద్యార్థి డి.శివ జెఎన్‌టియుకె ఫుట్‌బాల్‌మ్‌కు ఎంపికయ్యినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల యుఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన జెఎన్‌టియుకె ఇంటర్ కాలేజియేట్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో ఈ నెల 25 నుంచి 30 వరకూ తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో ఉన్న ఎస్ఆర్ఎం ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటాడని తెలిపారు. ఈ సందర్భంగా శివను విభాగాధిపతి ఎం.రవీంద్ర, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.రవి, ఎన్.శంకర్‌రావు అభినందించారు.

మాజీ మంత్రి ముద్రగడ పర్యటన

ప్రజాశక్తి- రౌతులపూడి

మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మండల కేంద్రమైన రౌతులపూడిలో శనివారం పర్యటించారు. రౌతులపూడి మాజీ సర్పంచ్ వాసిరెడ్డి దేవుళ్లను మర్యాదపూర్వక కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాత్రికేయుల ప్రశ్నలకు సమాధానం చెబుతూ త్వరలోనే ఏదో ఒక పార్టీలో చేరతానని వెల్లడించారు. ఈ పర్యటనలో అంకంరెడ్డి సతీష్ కుమార్, పందుల తాతారావు తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Known to all that applicant Kommu Raj Kumar, S/o. Kommu Joseph and Co-Applicant Kommu Abigail, W/o Kommu Raj Kumar have been sanctioned a Housing Loan by Repco Home Finance Ltd., for Purchase of House.

SCHEDULE : Formerly within the limits of East Godavari District, Presently within the limits of Kakinada District, Kakinada Rural Mandal, SRO-Kakinada, Turangi Village and Gram Panchayat, Old S.No.93/1, R.S.No.109/1 in an extent of Ac.0.93 3/4 cents of landed property is divided into fragmented site plot holdings, Plot No.9 in an extent of 283.55 Sq.yards = 237.08 Sq.mts., of site and RCC Roof Slab-bed Building therein bearing D.No.8-195, is bounded by the following boundaries and measurements as under:-

Boundaries: East: Ft.44.0 = 13.41 mts. Sites of Jatla Paparao, **West :** Ft.44.0 = 13.41 mts. Ft.20 Wide Road, **North:** Ft.58.0 = 17.67 mts. Ft.40 Wide Road, **South:** Ft.58.0 = 17.67 mts. Site in Plot No.10 sold by Dwarampudi Satyanarayana Reddy to others.

Within the above boundaries extent of 283.55 Sq.yards = 237.08 Sq.mts., of site and RCC Roof Slab-bed Building therein, with all common ways, water ways and with all easement rights attached thereto is in favor of Adapa Viswanath, duly rep. By his GPA holder , Adapa Vara Lakshmi proposed to sell the same to Kommu Raj Kumar and the same to mortgaged by Kommu Raj Kumar in favour of Repco Home Finance ltd., Kakinada Branch to avail Housing loan for Purchase of House of Rs.49,99,000/- anybody having interest or claims over the property shall intimate to us with in 7 days from the date of this publication inwriting.

Bhamidipati Venkata Rama Sarma, Advocate
Office : D No.25-4-50/1, Kommireddy Street,
Beside Temple Street, Kakinada - 533001.

YELESWARAM NAGAR PANCHAYAT

e-Procurement Notice

Online tenders are invited for ROC No. 154/2020/E1, Dt 23-12-2023 UPHC-1 works, Estimate amount of Rs. 16.45 Lakhs. Last date of receipt of tenders on or before Dt: 02-01-2024 up to 5.30 P.M. Further details can be seen at www.tender.apeprocurement.gov.in

Contact Number: 96520 65430, 96520 65431

Sd/- **COMMISSIONER**
YELESWARAM NAGAR PANCHAYAT

యానాం వార్తలు

తొలగించారు..వదిలేశారు

తొలగించిన కొమ్మలను వదిలేసిన వైనం

ప్రజాశక్తి - యానాం

యానాం నల్లచెరువు తూము నుంచి భీమ్ నగర్ వరకు గల మంచి నీటి కాలవ వెంబడి గల తుప్పలను కొంతమేర పిడబ్ల్యూడి ఎన్‌ఎంఆర్‌లు తొలగించారు. అయితే తుప్పలు తొలగించి రోజులు గడుస్తున్నా నేటి వరకూ తీయకుండా గుట్టలు గుట్టలుగా అలా వదిలేశారు. దీంతో తొలగించిన తుప్పలు ఎండిపోయి చాలా వరకు ప్రక్కనే ఉన్న మంచినీటి కాలవలో పడిపోయాయి. తుప్పలతో మంచినీటిని అపరిశుభ్రం చేశారని అధికారులు నిర్వాకంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలా వదిలేసేదానికి తొలగించడం ఎందుకని స్థానికులు నిలదీస్తున్నారు. పిడబ్ల్యూడి అధికారులు పనులు పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో ఈ ఉదంతం అర్థం అవుతుందని పలువురు పేర్కొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

చిన్నారులచే కేక్‌ను కట్ చేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - యానాం

స్థానిక మెట్టకూరు రీజెన్సీ పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు జీసస్ క్రీస్తు గురించి ప్రసంగించారు. విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం టివిఎస్-ఎస్‌వి.ప్రసాదరావు ఆధ్వర్యంలో ఎస్.భీమ్‌జ్యోతి, కె.శ్రీదేవి, బిందుమాధవి, బి.అశోక్ రెడ్డి, కె.క్రాంతికుమార్‌లు కేక్ కట్ చేసి విద్యార్థులకు అందించారు.

ఘనంగా మంత్రి వేణుపుట్టినరోజు వేడుకలు

కేక్‌ను కట్ చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - కాజులూరు

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పుట్టినరోజు వేడుకల మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన కాజులూరు ఎంపిడిఒ కార్యాలయంలోను, శీలలంక, కుయ్యేరు, గొల్లపాలెం, మంజేరు గ్రామాల్లో కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల వైసిపి అధ్యక్షుడు గుబ్బల యేసు రాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేయగా ఆయ గ్రామాల్లో నెల్లి బ్రహ్మాజీ, పిల్లి కృష్ణమూర్తి, పోతురాజు ప్రసన్నమౌనిక, గుంటూరు అప్పారావు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘ అధ్యక్షులు మేడిశెట్టి రాము, మాతా మురళి, యాళ్ల సత్తిబాబు, ఎంపిటిసి సభ్యులు మేడిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో మాట్లాడుతున్న టేకుమూడి ఈశ్వరరావు

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల మధ్యాహ్నం భోజన కార్మికులు యూనియన్ ఆధ్వర్యంలో పలు డిమాండ్లు చేస్తూ సమస్యలపై తహశీల్దార్‌కార్యాలయం వద్ద శనివారం ధర్నా చేశారు. కార్మికులకు మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టి. ఈశ్వరరావు పాల్గొని మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, మెనూ ఛార్జీలు పెంచాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ ఎస్.పోతురాజు కార్మికులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సుబ్బలక్ష్మి, చంద్రావతి, నూకరత్నం, బుజ్జి, కృష్ణవేణి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 3వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు :: కాకినాడ

I.A.No.792/2022 in I.A.No.793/2022
O.S.No.201/2022

బిట్వీన్:
1) వాస్క రామారావు ప్రభాతం
2) వాస్క మాణిక్య కుమారి
...వాది /పిటీషనర్సు
మరియు
కారంచేటి శ్రీరామచంద్రమూర్తి & అదర్స్
...ప్రతివాదులు /రెస్పాండెంట్సు

టు: కారంచేటి విశ్వర్కచైనులు
తండ్రి: శ్రీరామచంద్రమూర్తి, డో.నెం. 3-142/13, మాధవపట్నం, సామర్లకోట మండలం, కాకినాడ జిల్లా.

పై నెంబరు దావాలో 2వ ప్రతివాది/రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. పిటీషనర్సు మీ తాలూకు దావా ఆస్థిని ఇతరులకు అమ్మకూడదు అని కోరుచూ I.A. No. 792/2022 ను మరియు మీలో 1వ ప్రతివాది, 2వ ప్రతివాది/రెస్పాండెంటు పేరున వ్రాసిన దస్తావేజు నెంబరు 2153/2022 ను పూర్తిగా రద్దుచేయమని మరియు I.A. No. 793/2022 పిటిషన్ ద్వారా ఇతర న్యాయబద్ధమైన ఇతర క్రెడిటర్స్ తరుపు రిప్రజెంట్‌గా పిటీషనరు గారిని అనుమతించమని పిటీషన్లు దాఖలు చేసియున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీహాజరు నిమిత్తం **ది.29-12-2023వ తేదీన వాయిదా వేసియున్నారు. మీరు ఆరోజు ఉదయం గం॥10:30 ని॥లకు మీరు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను.** లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

వేమన అశోక్‌కుమార్
నక్కా శ్రీనివాస్, అడ్వకేట్స్,
కాకినాడ. సెల్: 95537 27777